సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం। 5। జూలై। 2025



ప్రాజెక్టుల భద్రతపై నిర్లక్ష్యం
ప్రాజెక్టుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని జాన్‌వెస్లీ అన్నారు.
వివరాలు 8లో ▸



వృత్తి నైపుణ్యం పెంపు
వృత్తి నైపుణ్యం పెంపునకే పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నామని డీఐజీ చౌహాన్ అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /21.8

వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మాజీ సీఎం రోశయ్య సేవలు ఎంతో గొప్పవి

నాగర్‌కర్నూల్ క్రైం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య ప్రజలకు ఎంతో సేవ చేశారని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతిని పురస్కరించుకొని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌ఐ నీటిని విడుదల చేయాలి



కందనూలు: కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా కాల్వలు, చెరువులకు నీటిని విడుదల చేయాలని శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు ఆధ్వర్యంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పార్థసారధికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నరేందర్‌రావు మాట్లాడుతూ ఎంజీకేఎల్‌ఐ ద్వారా వెంటనే పంపింగ్ ప్రారంభించి కాల్వలకు, చెరువులకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. పనిచేయని మోటార్లకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కాల్వలలో పూడిక, జమ్ము తొలగించి, చివరి ఆయకట్టుకు నీరు అందించాలని, లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంబీసీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కందనూలు: అత్యంత వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్యాలపై హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజిమ్ అలీ అప్సర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రెజ్యూం బిల్డింగ్, కమ్యూనికేషన్స్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్, మెంటల్ వెల్ బీయింగ్ ట్రైనింగ్‌పై శిక్షణ తరగతులు హైదరాబాద్‌లో ఉచితంగా ఇస్తారన్నారు. నాలుగు రోజులపాటు కొనసాగే శిక్షణ తరగతుల్లో అభ్యర్థులకు ట్రావెలింగ్, భోజన వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణకు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 21–30 ఏళ్లలోపు అర్హులని, ఎంబీసీ కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అన్నారు. ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి ఏడాదికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించరాదన్నారు. అభ్యర్థులు ఈ నెల 12 వరకు ఎంబీసీ tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత పత్రాలను తమ కార్యాలయంలో 14వ తేదీ సాయంత్రంలోగా అందించాలని సూచించారు.

అభివృద్ధి జోరు..

సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో పనులు వేగవంతం



కొండారెడ్డిపల్లెలో చేపట్టిన రోడ్డు నిర్మాణం

- చుట్టూరా సుందరీకరణతో మెరిసిపోయేలా కొండారెడ్డిపల్లి
- మొదటి విడతలో సుమారు రూ.150 కోట్లు కేటాయింపు
- అధునాతన భవనాలు, రోడ్ల విస్తరణతో మారుతున్న రూపురేఖలు
- ఈ దసరాలోగా పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు



పూర్తయిన గ్రామ పంచాయతీ భవనం

సాక్షి, నాగర్‌కర్నూల్/ వంగూరు: సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో విస్తృతంగా చేపట్టిన అభివృద్ధి పనులు కొన్ని రోజులుగా వేగం పుంజుకున్నాయి. జిల్లాలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో తొలి విడతలో ఇప్పటికే సుమారు రూ.150 కోట్ల నిధులతో పెద్దఎత్తున అభివృద్ధి పనులను చేపట్టగా.. మరోవిడత అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎక్కడ చూసినా అధునాతన భవనాలు, రోడ్ల విస్తరణ, సుందరీకరణ ఇతరత్రా అభివృద్ధి పనుల హడావుడే కనిపిస్తోంది. ఆయా పనుల పర్యవేక్షణకు ఇన్‌చార్జ్‌గా జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయంను ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలోనే దసరా పండుగకు సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో ఈలోపే ప్రధాన పనులను పూర్తిచేసేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

హైదరాబాద్ తర్వాత ఇక్కడే..

కొండారెడ్డిపల్లిలో ఇంటింటికీ సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలోని మొత్తం 515 ఇళ్లకు గానూ ఇప్పటి వరకు 405 ఇళ్లలో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేశారు. ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్ ద్వారా విద్యుదుత్పత్తి చేసి, తమ అవసరాలకు వినియోగించుకోవడమే కాక మిగులు విద్యుత్‌ను ఎస్పీడీసీఎల్‌కు విక్రయించుకునేలా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియ కేబుల్ వైర్లను స్తంభాలకు కాకుండా అండర్ గ్రౌండ్ కేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ తర్వాత ఇక్కడే ప్రభుత్వం అండర్ గ్రౌండ్ కేబుళ్లను గ్రామంలో ఏర్పాటు చేస్తుంది.

మారనున్న ముఖచిత్రం..

కొండారెడ్డిపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులతో గ్రామ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. పెద్దఎత్తున నిధులు వెచ్చించి విస్తృతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామంలోని అన్ని కాలనీలకు అంతర్గత సీసీరోడ్లు, ఎల్‌ఈడీ సెంట్రల్ లైటింగ్, విశాలమైన రహదారులు, అధునాతన ప్రభుత్వ భవనాలు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, ఇంటింటా సోలార్ వెలుగులు, గ్రామం చుట్టూ సుందరీకరణ పనులతో మెరిసిపోయేలా అధికారులు తీర్చిదిద్దుతున్నారు.

గ్రామానికి అన్ని హంగులు..



మా గ్రామానికి చెందిన ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎం కావడం మాకెంతో గర్వకారణం. ఇప్పటికే గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వెటర్నరీ ఆస్పత్రి, పాలశీతలీకరణ కేంద్రం, బస్టాండ్, పంచాయతీ భవనాలతోపాటు రోడ్లతో గ్రామం రూపురేఖలు మారుతున్నాయి.

– వేమారెడ్డి, కొండారెడ్డిపల్లి, వంగూరు మండలం

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ..

కొండారెడ్డిపల్లిలో అన్ని అభివృద్ధి పనులను సమాంతరంగా పూర్తిచేస్తున్నాం. ఇప్పటికే కొన్ని భవన నిర్మాణాలు, సీసీరోడ్లు, సోలార్ విద్యుత్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. పనులను ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నాం. దసరా నాటికి పనులను పూర్తి చేసేలా వేగం పెంచాం.

– దేవసహాయం, ఇన్‌చార్జ్ అధికారి, అదనపు కలెక్టర్

కొండారెడ్డిపల్లిలో ప్రధానంగా చేపట్టిన పనుల వివరాలు

పనులు	నిధులు (రూ.కోట్లలో)
రహదారుల విస్తరణ	21
మిషన్ భగీరథ పైప్‌లైన్	31.1
అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, ఎస్టీపీ	9.30
అంతర్గత సీసీ రోడ్లు	8.70
విద్యుత్ ఫీడర్ల ఏర్పాట్లు	2.85
పాలశీతలీకరణ కేంద్రం	2.50
గ్రామ పంచాయతీ భవనం	0.72
బీసీ కమ్యూనిటీ హాల్	0.58
గ్రంథాలయం	0.55
వెటర్నరీ ఆస్పత్రి భవనం	0.45
ఎల్‌ఈడీ లైట్లు	0.40

దండిగా నిధులు.. ఊరంతా పనులు

సీఎం స్వగ్రామంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనుల కోసం చేపట్టిన నిర్మాణాలే కనిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీ భవనం పూర్తికాగా.. ప్రధాన రహదారులు, అంతర్గత, సీసీ రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. కొండారెడ్డిపల్లి నుంచి పోల్కంపల్లి వద్దనున్న హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారి వరకు రోడ్డును సైతం నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.33 కోట్లు కేటాయించారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా పాలశీతలీకరణ కేంద్రం, వెటర్నరీ ఆస్పత్రి, గ్రామ పంచాయతీ, రైతు వేదిక ఆధునీకరణ, లైబ్రరీ, బీసీ, ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, సెంట్రల్ లైటింగ్, ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు, గ్రామం నుంచి మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు అనుసంధానంగా నాలుగు వరుసల రహదారులు, ఇంటింటా మిషన్ భగీరథ నీటి సౌకర్యం, సోలార్ విద్యుత్ ఏర్పాటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.



కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ➔

ప్రతి చెంచుకు శాశ్వత గృహాలు



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, పక్కన ఐటీడీఏ పీఓ రోహిత్ గోపిడి

నాగర్‌కర్నూల్: ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని, చెంచుపెంటల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చెంచుల ఇళ్ల నిర్మాణాలు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్య, సదుపాయాలపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోహిత్ గోపిడితో కలిసి ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్, వార్డెన్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది మండలాల పరిధిలో ఉన్న చెంచులకు శాశ్వత గృహాల మంజూరు నిర్మాణానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. చెంచుపెంటల్లో ఇది వరకే గుర్తించిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల నిర్మాణాలు అత్యంత పారదర్శకంగా అమలుచేయాలన్నారు. చెంచులు ఎవరు కూడా శాశ్వత గృహాలు లేకుండా ఉండరాదని, రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందని, అదే స్ఫూర్తితో జిల్లాలో అధికారులు పనిచేయాలన్నారు. అలాగే జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను గుర్తించడానికి ఒక్కొక్క వసతి గృహానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించామన్నారు. ఆశ్రమ, గిరిజన వసతి గృహాలను తప్పనిసరిగా ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. చెంచు గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రిన్సిపల్ లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, అప్పాపూర్ చెంచు పెంటలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం ఆంజనేయులును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, నాలుగు జతల ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు, దుప్పట్లు, టవల్స్, ట్రంకు బాక్సులు, షూలు పంపిణీ చేశారా.. అని పాఠశాలల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీపురంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలుర రెసిడెన్షియల్ గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే వసతులు, ఉపాధ్యాయుల హాజరు, భోజన సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి

నాగర్‌కర్నూల్: రెవెన్యూ అధికారులు తమ పనితీరు మరింత సమర్థవంతంగా నిర్వర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా పనిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలని, ప్రజలతో మమేకం కావాలని, నిబంధనల మేరకు ముందుకెళ్లాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అన్నింటికీ నోటీసులు అందజేసి అర్హత గల వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు



మన్ననూరులోని గురుకుల పాఠశాలలో అదనపు కలెక్టర్ దేవసహాయంతో ఉపాధ్యాయులు

మన్ననూర్: పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. శుక్రవారం ఆయన మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికలు, పీటీజీ పాఠశాల/కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు రూపాదేవి, పద్మావతి, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి అక్కడి పరిసరాలను కలియదిరిగారు. విద్యా బోధన, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందరికీ అందించారా.. అని ఆరాతీశారు. వసతి గృహం, పాఠశాలలో విద్యార్థుల సమస్యలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు రాత్రి సమయంలో పడుకునేందుకు మంచాలు, కొన్ని అదనపు టాయిలెట్స్ నిర్మాణాలు అవసరమని ప్రిన్సిపాల్ రూపాదేవి అదనపు కలెక్టర్ దృష్టికి తేగా స్పందించిన ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమకూర్చేందుకు కృషిచేస్తానన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సరిత, డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, మండల వ్యవసాయాధికారికారి మహేష్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి భీముడు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కల్వకుర్తి టౌన్: గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు గురుకుల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. లేదా అనే అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనశాలలు, వంట సరుకులను పరిశీలించారు. భోజనంలో ఎలాంటి తేడా వచ్చినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించి బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు.

ఎక్కడి రైళ్లు అక్కడే..!

- బోయపల్లి గేట్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు
- 4 గంటల పాటు పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం
- నిలిచిపోయిన హంద్రీ, బెంగళూరు, చెన్నై ఎగ్మోర్, ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్, వందే భారత్ రైళ్లు
- తీవ్ర అవస్థలు పడిన ప్రయాణికులు
- రాత్రి 10 గంటల తర్వాత రైళ్ల పునరుద్ధరణ



వనపర్తి రైల్వేస్టేషన్‌లో నిలిచిన వందేభారత్, రాయచూర్ డెమో రైళ్లు

స్టేషన్ మహబూబ్‌నగర్/ మదనాపురం/ జడ్చర్ల టౌన్ : జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి బోయపల్లి రైల్వే గేటు సమీపంలో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రామగుండం నుంచి ఎరువులతో తమిళనాడు వెళుతున్న గూడ్స్ రైలుకు సంబంధించిన ఒక బోగి శుక్రవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో పట్టాలు తప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో హైదరాబాద్ – బెంగళూరు మార్గంలో ఎక్కడికక్కడ రైళ్లను నిలిపివేశారు. హైదరాబాద్ కాచిగూడ నుంచి యాక్షన్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్‌టీ)ను తెప్పించి.. మరమ్మతులు చేసి రాత్రి 10 గంటల తర్వాత రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా.. దాదాపు నాలుగు గంటల పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. రైల్వే స్టేషన్లలో పడిగాపులు కాశారు. సౌత్ సెంట్రల్ రైల్వే హెల్ప్ లైన్ నంబర్లు, డెస్కులను ఏర్పాటు చేసింది. కర్నూలు వైపు వెళుతున్న హంద్రీ ఎక్స్‌ప్రెస్‌ను జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో, చెంగల్‌పట్టు (చైన్నై ఎగ్మోర్) దివిటిపల్లి వద్ద, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ను (తిమ్మాపూర్) వద్ద, కాచిగూడ–మైసూరు (బెంగుళూరు ఎక్స్‌ప్రెస్)ను బాలానగర్ స్టేషన్‌లో, వందేభారత్ డోకూరు స్టేషన్‌లో, ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్ కౌకుంట్ల స్టేషన్‌లో, యశ్వంత్‌పురా వందేభారత్, రాయచూర్ డెమో రైళ్లను మదనాపురం స్టేషన్‌లో, అలోక్ స్పెషల్ కర్నూలులో, గూడ్స్ రైలును గొల్లపల్లి స్టేషన్‌లో నిలిపివేశారు. రైళ్ల రాకపోకలు ఆలస్యం అవుతాయని గుర్తించి హంద్రీ ఎక్స్‌ప్రెస్‌లో 70 శాతం మంది ప్రయాణికులు వెళ్లిపోయారు. ఆటోల్లో బస్టాండ్‌కు చేరుకుని అక్కడి నుంచి కర్నూలుకు వెళ్లారు. వెంకటాద్రి, బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లలోని ప్రయాణికులు ఇళ్లకు వెళ్లిపోగా..గుంటూరు రైలుకు వచ్చే ప్రయాణికులు స్టేషన్‌లోనే పడిగాపులు కాశారు. దివిటిపల్లి, మదనాపురం, కౌకుంట్ల స్టేషన్లలో రైళ్లను నిలిపివేయడం వల్ల తిండి లేక చిన్న పిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడ్డారు.

రైలులో జ్వరంతోనే..



ఎమ్మిగనూరు గంజిల గ్రామానికి చెందిన కె.లక్ష్మి అనారోగ్యంతో ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిశ్చార్జి అయి స్వగ్రామానికి వెళ్లేందుకు భర్త పెద్దలింగన్నతో కలపి హంద్రీ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. జడ్చర్ల స్టేషన్‌లో రైలు నిలవటంతో ఇబ్బందులు పడ్డారు. జ్వరం రావడంతో మాత్రలు వేసుకుని రైలులోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. మూడు నెలల తర్వాత ఇంటికి వెళ్దామంటే ఇలా ఇబ్బందులు వస్తాయని అనుకోలేదని ఆ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.



మహబూబ్‌నగర్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

మధ్యలో నిలిపేస్తే ఎలా..?



కొన్నేళ్ల క్రితం గొంతుకు శస్త్రచికిత్స అయ్యింది. అందుకే ఎక్కువ సేపు రైలులో ఉండలేనందున బస్సుకు వెళ్దామని పోతున్న. రైళ్ల రాకపోకలు ఇబ్బంది కలిగినప్పుడు బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటది. ఇలా మధ్యలో రైళ్లు నిలిపివేస్తే ఎలా.? – శివమూర్తి, కర్నూలు

రైతు సేవలే లక్ష్యం

సహకార రంగాల అభివృద్ధికి పటిష్ట చర్యలు

- త్వరలో అందుబాటులోకి మొబైల్ బ్యాంకింగ్
- విద్యా రుణాలకు పెద్దపీట.. ఆశాజనకంగా వసూళ్లు
- రుణమాఫీతో 34,731 మంది రైతులకు ఊరట
- నేడు అంతర్జాతీయ సహకార దినోత్సవం



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు సేవలే లక్ష్యంగా సహకార రంగ అభివృద్ధికి పాలక మండలి, అధికారులు కృషి చేస్తున్నారు. సింగిల్ విండో సొసైటీలు, డీసీసీబీ బ్రాంచ్‌ల ద్వారా రైతుల మేలు కోసం ఆర్థిక లావాదేవీలపై సంబంధిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ రైతులను చైతన్య పరుస్తున్నారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారమే ఏడాది పొడవునా సహకార దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 78 సింగిల్ విండో సొసైటీలు, 22 డీసీసీబీ బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయి. వీటి కింద అనేక మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. రైతుల ఆర్థిక పరిపుష్టి కోసం ఇటు బ్యాంకులు.. అటు సొసైటీలు పరస్పర సహకారంతో కృషి చేస్తున్నాయి. సహకార శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే జిల్లాలో రైతు చైతన్య కార్యక్రమాలు షెడ్యూల్ విడుదల చేశారు. ఇక మహబూబ్‌నగర్ జిల్లాలో మార్చి 22 నుంచి ఇక్కడి సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జిలు, అధికారులు రైతు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆర్థిక లావాదేవీలు, ప్రగతిపై నివేదిక

జిల్లాలో సహకార బ్యాంకులు, సింగిల్ విండో సొసైటీలు వాటి పరిధిలో జరిగే ఆర్థిక లావాదేవీలు, ప్రగతిపై డీసీసీబీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీతోపాటు స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంట రుణాలు, విద్యా రుణాలు, గ్రామీణ గృహ రుణాలు, కర్షకమిత్ర రుణాలు, రుణ వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఖాతాదారుల సౌకర్యం కోసం రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతితో మొబైల్ బ్యాంకింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఖాతాదారుల లావాదేవీలు సులభతరం, సమయాన్ని ఆదా చేసుకోవడం, డిజిటల్ లావాదేవీలతో బ్యాంకు సమర్థత పెంచుకోవడానికి ఉపయోగపడే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

విదేశీ విద్యకు చేయూత

రైతు కుటుంబాల్లో ఉన్నత విద్య చదవాలనే ఆసక్తి కలిగిన పిల్లలకు డీసీసీబీ తరఫున ప్రత్యేకంగా విద్యా రుణాలు అందిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైతుల పిల్లలకు స్వదేశీ, విదేశీ విద్యా రుణాలు అందించేందుకు పాలక మండలి ప్రత్యేకంగా రుణాల పాలసీ ప్రకటించింది. ఒక్కో విద్యార్థికి కనీసం రూ.35 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2024 నవంబర్ 30 వరకు మొత్తం 79 మంది విద్యార్థులకు రూ.3.82 కోట్ల రుణాలు అందజేశారు.

34,731 మందికి మేలు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ పథకం–2024 కింద డీసీసీబీ పరిధిలో అనేక మందికి ప్రయోజనం కలిగింది. ఈ బ్యాంకు ద్వారా రూ.2 లక్షల వరకు స్వల్పకాలిక రుణాలు అర్హత కలిగిన 68,495 మంది సభ్యులకు గాను రూ.47,684.81 లక్షల రుణం పొందారు. ఇందుకు సంబంధించి 2024 నవంబర్ నాటికి మూడు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసింది. దీంతో రూ.2 లక్షల రుణం కలిగి ఉన్న 34,731 సభ్యులకు రూ.20,639.30 లక్షల రుణమాఫీ జరిగింది.

ఆర్‌బీఐ అనుమతితో..



వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులను అభివృద్ధిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో త్వరలో సహకార బ్యాంకుల పరిధిలో మొబైల్ బ్యాంకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. ఆర్‌బీఐ అనుమతితో వినియోగదారులందరికీ మొబైల్ బ్యాంకింగ్‌తోపాటు యూపీఐ సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి రూ.1,800 కోట్ల బిజినెస్ టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే బ్యాంకు డిపాజిట్లు రూ.400 కోట్లకు చేరుకున్నాయి.

– మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, చైర్మన్, డీసీసీబీ

క్లుప్తంగా

మట్టిదిమ్మె పడి వలస కూలీ మృతి


ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్

వీపనగండ్ల: బతుకు దెరువు కోసం వచ్చి మండల కేంద్రంలో కూలీగా పనిచేస్తున్న బోగమోనిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (42) మట్టిదిమ్మె కూలి మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రాణి కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన రైతు బాబూజీగౌడ్ భీమా కాల్వ నుంచి తన వ్యవసాయ బావికి పైపులను అమర్చేందుకు పొక్లెయిన్‌తో కాల్వ తవ్వుతుండగా కాల్వలో పైపులు అమరుస్తున్న వెంకటేష్ మట్టి దిమ్మె కూలి మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ తాలుకా బోగమోనిపల్లి గ్రామానికి చెందిన మృతుడు, అతని భార్య గోవిందమ్మ రెండు సంవత్సరాలుగా బాబూజీగౌడ్ వద్ద కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

చిన్నంబావి: ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్తే.. మండలంలోని బెక్కెం గ్రామానికి చెందిన గొల్ల సుంకులయ్య (60) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య, కుమారుడు హైదరాబాద్‌లో పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. దీంతో సుంకులయ్య ఇంటి వద్ద ఒక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆయన ఇంటి వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకోవడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

ఇంజినీర్ అనుమానాస్పద మృతి

- ఫిర్యాదు చేసిన మృతుడి భార్య

నవాబుపేట: ప్రైవేట్ మినరల్స్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అతడు నివాసం ఉండే కంపెనీ గదిలోనే అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతి విషయం బయటికి పొక్కకుండ రెండు రోజులుగా రహస్యంగా ఉంచడంతో అనుమానాలకు తావిస్తోందని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కాకర్‌జాల్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ మినరల్స్ కంపెనీలో ఆంధ్రప్రదేష్ కృష్ణా జిల్లా, పమిడి ముక్కల మండలం, మంటాడ గ్రామానికి చెందిన పూర్ణచందర్‌రావు (43) ఏప్రిల్‌లో మెకానికల్ ఇంజినీర్‌గా చేరాడు. ఈ నేపథ్యంలో కంపెనీ కేటాయించిన గదిలో నివాసం ఉండేవాడు. కాగా ఈ నెల 2వ తేదీ బుధవారం రాత్రి విధులు ముగించుకొని గదిలో నిద్రించాడు. కాగా గురువారం గదిలో శవమై కనిపించడంతో తోటి ఉద్యోగులు కంపెనీ యాజమాన్యానికి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో పూర్ణచందర్‌రావు మృతిపై అనుమానం ఉందని మృతుడి భార్య దీప్తి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతి విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ నెల 1న మండల పరిధిలోని గౌరారం సమీపంలో బైక్‌పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కాడెద్దులు మృత్యువాత



ఊట్కూరు: విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమవడంతో పాటు కాడెద్దులు సజీవ దహనమైన ఘటన మండలంలోని పెద్దపొర్ల గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లచ్చమ్మ కాడెద్దులను పొలం వద్ద రేకుల షెడ్డులో కట్టేసి గురువారం రాత్రి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా అప్పటికే విద్యుత్ షాక్‌తో రేకుల షెడ్డు, గుడిసె, కాడెద్దులు, ఎరువులు తదితర సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు గుర్తించాడు. సుమారు రూ.2, 50 లక్షలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వ తరపున ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,260

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం మొక్కజొన్న క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,260, కనిష్టంగా రూ.2,149 ధరలు లభించాయి. కందులు గరిష్టంగా రూ. 4,400, కనిష్టంగా రూ.3029 ధరలు పలికాయి.

ప్రాజెక్టుల భద్రతపై నిర్లక్ష్యం


జూరాల ప్రాజెక్టుపై పర్యటిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు

- క్రస్ట్‌గేట్ల రోప్‌లు తెగినా పట్టింపు లేదు
- అధికారులతో వాగ్వాదం
- సీఎం సొంత జిల్లాలో ఇంత నిర్లక్ష్యమా?
- జూరాల ప్రాజెక్టు సందర్శనలో జాన్‌వెస్లీ

అమరచింత: ప్రాజెక్టుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, జూరాల ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల రోప్‌లు తెగినా సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును సందర్శించకపోవడం ఏమిటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును శుక్రవారం సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి జాన్‌వెస్లీ సందర్శించారు. జూరాల ప్రాజెక్టుపై తమకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఈఈ జుబేర్‌అహ్మద్, అధికారులతో సీపీఎం నాయకులు వాగ్వాదానికి దిగారు. తెగిపోయిన క్రస్ట్‌గేట్ల రోప్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు జిల్లా రైతులకు వరప్రదాయినిగా నిలిచిన జూరాల ప్రాజెక్టు ప్రమాదంలో పడటానికి పాలకులు చేసిన పాపలే కారణం ధ్వజమెత్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరును అందించే ప్రాజెక్టుపై ఉదాసీనంగా వ్యవహరించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

వాస్తవాలు వెల్లడించాలి

8 గేట్ల రోప్‌లు తెగిపోయి ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని, వెంటనే సీఎం జూరాల ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించి వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. సొంత జిల్లాకు ఆయువుపట్టు లాంటి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రతి ఐదేళ్లకొకసారి రోప్‌లు మార్చలేని స్థితిలో అధికారులు ఉన్నారని, ఇది పభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. వాహన రాకపోకల కోసం బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం మంచి పరిణామం అని, కానీ కాగితాల వరకే పరిమితం కాకుండా వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు.

ఒక్క పైసా ఖర్చు చేయలే..

జూరాల ప్రాజెక్టు మరమ్మతుకు గత బడ్జెట్‌లో రూ.17 కోట్ల కేటాయించినా ఒక్క పైసా ఖర్చు చేయలేదని ఆల్‌ఇండియా కిసాన్ సభ అఖిల భారత ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి ఆరోపించారు. ఈ సంవత్సర బడ్జెట్‌లో సైతం మళ్లీ రూ.17 కోట్లే కేటాయించారని, కనీసం ఇప్పుడైనా మరమ్మతు చేయాలని కోరారు. జూరాల ప్రాజెక్టులో షిల్ట్ పెరిగిందని, తొలగించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. 11 టీఎంసీల నీటి నిల్వ ఉండాల్సిన ప్రాజెక్టులో కర్ణాటక ఒత్తిడి మేరకు గత ప్రభుత్వాలు కేవలం 7 నుంచి 9 టీఎంసీలు మాత్రమే నిల్వ చేస్తున్నారని ఆరోపించా రు. కార్యక్రమంలో సీపీఎం వనపర్తి, గద్వాల జి ల్లాల కార్యదర్శులు వెంకటస్వామి, పుట్ట ఆంజనేయ లు, మహమూద్, బబ్బార్, జీఎస్ గోపి, రా జు, వెంకటేష్, రాఘవేంద్ర, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

జూరాలకు మళ్లీ పెరిగిన వరద


జూరాల ప్రాజెక్టు వద్ద 14క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- 1.15లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- 14 గేట్లు ఎత్తి 1.27లక్షల క్యూసెక్కుల ఔట్ ఫ్లో

ధరూరు/ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురిసిన వర్షాలతో ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం ప్రాజెక్టుకు 80వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం ఉదయం నుంచి క్రమంగా పెరుగూ వచ్చింది. సాయంత్రానికి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో లక్షా 15వేల క్యూసెక్కులకు పెరిగినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 14 క్రస్టు గేట్లను ఎత్తి 95వేల 566 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 29,494 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 44 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులు, కుడి కాల్వకు 280 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం లక్షా 27,659 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.991 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్లద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు.

శ్రీశైలానికి భారీగా నీటి ప్రవాహం

దోమలపెంట: జూరాల నుంచి 1,24,610 క్యూసెక్కుల నీటిని దిగువున ఉన్న శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. శుక్రవారం నాటికి శ్రీశైలం జలాశయంలో 876.3 అడుగుల నీటిమట్టం వద్ద 169.8650 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 17.498 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేసి 34,926 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంతో 14.428 మి.యూనిట్ల విద్యుతుత్పత్తి అనంతరం 26,140 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్ జలాశయానికి విడుదల చేశారు. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 292 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

రామన్‌పాడుకు 1200 క్యూసెక్కుల వరద

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి శుక్రవారం 1200 క్యూసెక్కుల వరద చేరిందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. జలాశయంలో సముద్ర మట్టానికి పైన 1,018 అడుగులు ఉండగా.. జూరాల ఎడమ, కుడి కాల్వల్లో 550 క్యూసెక్కులు, సమాంతర కాల్వలో 670 క్యూసెక్కుల వరద కొనసాగుతుందన్నారు. అలాగే రామన్‌పాడు జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 564 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 45 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 872 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు.

గొర్రెల మందపై చిరుత దాడి

నారాయణపేట రూరల్: మండలంలోని పేరపల్ల గ్రామ శివారులో శుక్రవారం గొర్రెల మందపై చిరుత దాడి చేయడం స్థానికుల్లో కలకలం రేపింది. కొన్ని రోజులుగా స్థానికంగా చిరుత సంచరిస్తుందని వార్త తెలిసి రైతులు భయాందోళనలకు గురవుతున్న నేపథ్యంలో గొర్రెల మందపై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని సుదర్శన్ పొలంలో వారికి సంబంధించిన గొర్రెల మందను ఉంచారు. అక్కడే ముగ్గురు రైతులు సైతం కాపలాగా రాత్రి బస చేశారు. ఈ క్రమంలో చిరుతతో పాటు దాని పిల్ల అటుగా వచ్చి గొర్రెల చుట్టు వేసిన వలను చీల్చి మందపై దాడి చేసింది. వాటిలో నుంచి ఒక గొర్రె పిల్లను ఎత్తుకొని అడవిలోకి వెళ్లింది. ఈ విషయాన్ని రైతులు ఫారెస్ట్ అధికారులకు విన్నవించారు. వెంటనే చిరుతను బోనులో బంధించి జూ కు తరలించాలని బీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

హత్యాయత్నం కేసు నమోదు

ధరూరు: పొలం విక్రయించకుండా అడ్డుకోవడంతో పాటు ఓ వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని చింతరేవుల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివారలు.. గ్రామానికి చెందిన సురేష్ తన పొలం విక్రయించేందుకు సిద్ధమవగా అదే గ్రామానికి చెందిన నరేష్ దాడికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నరేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

విధ్వంసానికి గురవుతున్న కార్మిక సంక్షేమం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాలతో కార్మిక సంక్షేమం విధ్వంసానికి గురవుతోందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆరోపించారు. ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మె నేపథ్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట పారిశుద్ధ్య సెక్యూరిటీ కార్మికులు నిరసన తెలిపి, సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పెను ప్రమాదకర విధానాలే సార్వత్రిక సమ్మెకు కారణమన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు ఎవరి ప్రయోజనాల కోసం తెచ్చారో కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.రంగన్న, యాదయ్య, యం.డి.ఉమర్, శ్రీను, లక్ష్మి, చిట్టెమ్మ, సువర్ణ, సంగీత, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కీచక గురువు

- పదో తరగతి విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన
- పోక్సో కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: విద్యా బుద్ధులు నేర్పాల్సిన గురువే కీచకుడిగా మారాడు. బాధ్యతాయుత, గౌరవ ప్రదమైన స్థానంలో ఉన్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అమ్మాయిలతో అసభ్యకరంగా ప్రవర్తించడం, భూతులు తిట్టడం కలకలం రేపుతోంది. రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ధర్మపూర్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్న రామ్మోహన్ కొంత కాలంగా పదో తరగతి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడం, పాఠాలు బోధించే సమయంలో ఒంటిపై చేతులు వేయడం, అసభ్యకరమైన పదజాలం ఉపయోగించి దూషించడం చేస్తున్నాడు. ఈ క్రమంలో వేధింపులకు గురువుతున్న విద్యార్థినులు శుక్రవారం షీటీం బృందానికి ఫోన్‌లో తమ బాధను విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో షీటీం పోలీస్ సిబ్బంది పాఠశాలకు చేరుకుని విద్యార్థుల సమక్షంలోనే విచారణ చేపట్టారు. అమ్మాయిలతో తప్పుగా ప్రవర్తిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో సదరు ఉపాధ్యాయుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంపై సహ ఉపాధ్యాయుడు శంకర్ ఫిర్యాదు మేరకు రామ్మోహన్‌పై పోక్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

గతంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు

2019 విధులు నిర్వర్తిస్తున్న రామ్మోహన్‌పై ఈ ఏడాది ఏప్రిల్‌లో విద్యార్థులు హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహారించడంతో పాటు ఎలాంటి విచారణ చేయకుండా వదిలేయడంతో అతని ఆగడాలు మరింత పెరిగినట్లు విద్యార్థినులు వాపోయారు. ఇటీవల వేసవి సెలవులు పూర్తయిన అనంతరం తిరిగి వేధిస్తుండటంతో విసిగిపోయిన విద్యార్థినులు షీటీంను సంప్రదించినట్లు తెలిపారు. ఈ ఘటనపై డీఈఓ రవీందర్‌ను వివరణ కోరగా ధర్మపూర్ పాఠశాల వ్యవహారంపై విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వాలని సదరు ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పెద్దసారు కుర్చీ ఖాళీ!


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ


జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

- రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నియామకం కాని అధికారి
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఖాళీ కుర్చీలే..

మెట్టుగడ్డ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కేంద్ర బిందువు, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయమైన జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రారు కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం అందించే కార్యాలయాల్లో ఒకటి. ముఖ్యంగా జిల్లాల పునర్విభజన తర్వాత మహబూబ్‌నగర్‌తోపాటు నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాలు ఏర్పడ్డాయి. కొత్త జిల్లాలు ఏర్పడ్డా కూడా జిల్లాకో రిజిస్ట్రార్‌ను నియమించాల్సి ఉండగా.. ఏ ఒక్కరినీ నియమించలేదు. ఉమ్మడి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకూ ఒక్కరే కొనసాగుతూ వచ్చారు. అయితే ఇక్కడ పనిచేసే రిజిస్ట్రార్ రవీందర్ గతనెల 30న ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీ ఏర్పడింది. రోజుకు లక్షల్లో ఆదాయం అందించే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై పర్యవేక్షణ లేకుంటే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశం లేకపోలేదు. కావున ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు వచ్చినా చెప్పుకునే అధికారి లేకపోతే ఎవరికి విన్నవించుకోవాలని, వెంటనే జిల్లాకు రిజిస్ట్రార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. కొసమెరుపు ఏంటంటే ఉద్యోగ విరమణ చేసిన అధికారి పేరు ఇంకా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని సమాచార హక్కు చట్టం బోర్డులో అలాగే కొనసాగడం విశేషం.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకే..


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

- పోలీస్ డ్యూటీ మీట్
- 72 మంది విజేతలకు మెడల్స్ అందజేత
- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు సిబ్బందికి వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పోలీస్ డ్యూటీ మీట్‌ను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లు జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా వృత్తిపరమైన అంశాల్లో శిక్షణ పొంది పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారిని స్టేట్ లెవల్‌కు, అక్కడ విజేతలుగా నిలిస్తే జాతీయ స్థాయిలో జరిగే పోలీస్ డ్యూటీ మీట్‌కు పంపుతామని పేర్కొన్నారు. దేశస్థాయిలో జరిగే కార్యక్రమంలో విజేతలు నిలిస్తే వారికి పోలీసుశాఖ నుంచి ఇంక్రిమెంట్లు, క్యాష్ రివార్డులు ప్రకటిస్తామని తెలిపారు.

5 జిల్లాల నుంచి..

రెండురోజుల పాటు నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన పోలీసు డ్యూటీ మీట్‌లో జోగుళాంబ గద్వాల జోన్‌లోని 5 జిల్లాలకు సంబంధించిన పోలీసులు పాల్గొనగా.. 24 అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన 72 మందికి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను అందజేశారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆధ్వర్యంలో పకడ్బందీగా జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌ను నిర్వహించి, స్వతంత్ర జడ్జిలతో విజేతలు ప్రకటించడం అభినందనీయమని డీఐజీ చౌహాన్ అన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్, వనపర్తి ఎస్పీ గిరిధర్, అదనపు ఎస్పీలు రామేశ్వర్, ఏఆర్‌ఏ ఎస్పీలు రియాజ్ ఉల్‌హక్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

శభాష్.. పరమేశ్

- కలెక్టర్ బదావత్ సంతోష్
- బ్రిడ్జి కోర్సులో పీహెచ్‌డీ
- అభినందించి ప్రశంసించిన కలెక్టర్


పరమేశ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: పశువులను మేపుతూ చదువుపై పరమేశ్ చూపిన అంకితభావం అమోఘమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బల్మూరు మండలంలోని కొండనాగులకు చెందిన పరమేశ్ కార్మికుడిగా ఉంటూ.. 14ఏళ్లకు పాఠశాలలో ఏడో తరగతిలో చేరి బ్రిడ్జి కోర్స్ పద్ధతిలో విద్యనభ్యసించి పీహెచ్‌డీ సాధించిన సందర్భంగా శుక్రవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా పరమేశ్‌ను కలెక్టర్ అభినందించి శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చదువు నుంచి దూరంగా ఉన్న యువతకు పరమేశ్ ఒక స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలుస్తున్నారని, అతని విద్యాజీవితం ఎంతోమందికి మార్గదర్శకమవుతుందన్నారు. చదువుకు దూరంగా ఉన్న యువతను మార్గనిర్దేశించగల శక్తి పరమేశ్ కలిగి ఉన్నాడని, అతని జీవన ప్రయాణం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అవకాశాలు అన్వేషిస్తే ప్రతిభ బయటపడతుందన్నారు. పరమేశ్ జీవితం అందుకు నిలువెత్తు ఉదాహరణ' అంటూ కలెక్టర్ ప్రశంసించారు. జిల్లాలో విద్యార్థులకు ప్రేరణ తరగతులను అందించేందుకు సేవలు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. అంతకు ముందు పరమేశ్ పశువుల కాపరి నుంచి పీహెచ్‌డీ సాధించేవరకు తన ఎదుగుదలను కలెక్టర్‌కు వివరించారు.

భారీ కొండచిలువ పట్టివేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం మోజెర్ల గ్రామ శివారులోని శంకరసముద్రం రిజర్వాయర్ ప్యాకేజీ–19 కెనాల బ్రిడ్జి సమీపంలో భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. మరమ్మతు పనులు చేపడుతున్న కూలీలు కొండచిలువను గుర్తించి అధికారులకు తెలుపగా వారు స్నేక్ క్యాచర్ కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. అతి కష్టం మీద పొక్లెయిన్ సాయంతో కొండచిలువను పట్టుకున్నారు. కొండచిలువ 22 కేజీల బరువు, 3.5 మీటర్ల పొడవు ఉందని, సమీప అటవీ ప్రాంతంలో వదిలేయనున్నట్లు కృష్ణసాగర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో చిలుక కుమార్‌సాగర్, ధనుంజయ్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు


మాట్లాడుతున్న ఉద్యాన శాస్త్రవేత్తలు

కొత్తకోట రూరల్: రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి కూరగాయల సాగు చేయడం ద్వారా రోజు ఆదాయాన్ని పొందవచ్చని ఉద్యాన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త డా.శ్రీనివాస్, ఏఓ సైదులు అన్నారు. శుక్రవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి రైతువేదికలో కూరగాయల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, జీడిమెట్ల ఆధ్వర్యంలో రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కోరమాండల్ ఏటీఎం శివకుమార్, సీనియర్ మేనేజర్ మంజునాథ్, జీడిమెట్ల హార్టికల్చర్ అధికారి జలంధర్, ఉద్యాన అధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి మధు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓ వరం


మాట్లాడుతున్న రాష్ట్ర ఓపెన్ స్కూల్ డైరెక్టర్ సోమిరెడ్డి

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదని రాష్ట్ర ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జిల్లాలో పర్యటించి డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 10వ తరగతిలోపు, డ్రాప్ అవుట్ విద్యార్థులను ఓపెన్ పదోతరగతిలో, పది పాసైన విద్యార్థులను ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించాలన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 11 వరకు గడువు ఉందని, రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 12 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. దేశంలోని ప్రతి మహిళకు చదువు చెప్పాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పథకాన్ని ప్రవేశపెట్టిందని.. 15 ఏళ్ల నిండిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం, వారికి అవసరమైన నైపుణ్యాలు నేర్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనీ, డీఆర్డీఓ ఉమాదేవి, డీపీఎం ప్రభాకర్, డీడబ్ల్యూఓ సుధారాణి, నితిన్, రాజేంద్రప్రసాద్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.